

పాదయాత్రలో డప్పు వాయిస్తున్న కళాకారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగిరం చేయాలి

» సమస్యల పరిష్కారానికి మండల స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయండి

» వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డిఅర్బన్/యాచారం. జూలై 31(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగిరం చేయాలని, వీటికి సంబంధించి సమస్యలను పరిష్కరించడానికి మండల స్థాయిలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థలం ఉండి అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయాలన్నారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి మండల కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. జిల్లాలోని పాఠశాలలు, వసతి గృహాలలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, తాగునీరు అందించాలని, ఇందుకు అవసరమైన నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమ హాస్టళ్లలో శుభ్రమైన కూరగాయలను వినియోగించాలన్నారు. మధ్యాహ్నభోజన నాణ్యతను ఎంఈవోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాల మేరకు మొక్కలు నాటాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో పల్లెప్రకృతి వనాలలో వందశాతం మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సంగీత, డీఆర్‌డీవో పీడీ శ్రీలత, గృహనిర్మాణ శాఖ పీడీ హీర్యానాయక్, వ్యవసాయశాఖ అధికారి ఉష తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని స్వాగతిస్తున్నాం

» సేవ్ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు రవి

రంగారెడ్డి అర్బన్/యాచారం, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖలో ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఎఫ్ఆర్ఎస్ (ఫెషియల్ రికగ్నేషన్ సిస్టం) విధానాన్ని అమలు చేయడం ప్రయోజనకరంగా ఉంటుందని సేవ్ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు రవి అన్నారు. ఈ విధానంతో ఉపాధ్యాయులకు వృత్తిపై జవాబుదారితనం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి ఇది దోహదపడుతుందన్నారు. ఎఫ్ఆర్ఎస్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు.



రంగాపూర్ వద్ద పాదయాత్రలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, తదితరులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

కాంగ్రెస్ జనహిత పాదయాత్ర

కాంగ్రెస్ జనహిత పాదయాత్ర మొదటి రోజు ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగింది. గురువారం పరిగి నియోజకవర్గంలోని రంగాపూర్ నుంచి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ నుంచి భారీ కాన్వాయ్‌తో వచ్చిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు రంగాపూర్ వద్ద స్థానిక నేతలు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులతో నీరాజనాలు పలికారు. అనంతరం సేవాదళ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను వారు ఆవిష్కరించి జనహిత పాదయాత్రను ప్రారంభించారు.



హారతి పడుతున్న మహిళలు

శ్రేణుల్లో నిండిన జోష్.. మొదటి రోజు విజయవంతం

భారీగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులు.. పోలీసుల భారీ బందోబస్తు

పరిగి/రంగారెడ్డి అర్బన్/పూడూరు/దోమ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రంగాపూర్ నుంచి పరిగి వరకు ఎనిమిది కిలోమీటర్ల దూరం మొదటిరోజు పాదయాత్ర కొనసాగింది. పాదయాత్రలో రంగాపూర్, హనుమాన్‌గండి, నజీరాబాద్, పరిగి పట్టణంలో వారికి ఘన స్వాగతం లభించింది. దారిపొడవునా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒకరితో ఒకరు పోటీ పడుతూ ఉత్సాహంగా పాదయాత్రలో పాల్గొన్నారు. వికారాబాద్ జిల్లాతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ నుంచి భారీగా నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈ పాదయాత్ర పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపింది. అప్పా జంక్షన్ నుంచి పరిగి పట్టణం వరకు దారిపొడవునా స్వాగతం పలుకుతూ ఇరువైపులా ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలు, పార్టీ జెండాలు ఏర్పాటు చేశారు.

పాదయాత్ర కార్యక్రమం సాగిందిలా..

మహేశ్‌కుమార్‌గౌడ్, మీనాక్షీనటరాజన్‌తో పాటు పార్టీ ముఖ్య నేతలు గురువారం రంగాపూర్‌కు

మిగతా 7వ పేజీలో...

ప్రజాహితం కోసమే : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



కాంగ్రెస్ చేపడుతున్న జనహిత పాదయాత్ర స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాదని.. ప్రజాహితం కోసమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. పరిగి చౌరస్తాలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చాక ప్రజల్లోకి వెళ్లాలనే ఈ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సాయం అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌కు చిత్త శుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ కోసం కాంగ్రెస్ చేస్తున్న పోరాటానికి కలిసి రావాలన్నారు. కాంగ్రెస్ సర్కార్ ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును తీసుకు వస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ నిలిపి వేశారన్నారు. ప్రాణహిత-చేవెళ్ల, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి జిల్లాకు తాగునీటిని అందించే ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

పరిగి నుంచి ప్రారంభించడం సంతోషకరం


» డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



ఎన్నో సత్యాగ్రహాలు, దీక్షలు, ఉద్యమాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ భావజాలాన్ని ప్రజలకు తెలియజేసేందుకే టీపీసీసీ.. జనహిత పాదయాత్ర చేపట్టిందని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పాదయాత్రను పరిగి నుంచే శ్రీకారం చుట్టడం సంతోషకరమన్నారు. రాజ్యాంగాన్ని చులకన చేస్తున్న బీజేపీ ఆగడాలను ఎండగట్టేందుకే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్తున్నట్లు తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు ఇచ్చిన హామీకి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు.

ఆలయాల భూములు పదిలమేనా?

ధరలు పెరగడంతో భక్తుల అనుమానాలు



రంగంపల్లి శివారులో ఉన్న సీతారామచంద్ర స్వామి ఆలయ భూములు

పదిహేనేళ్లుగా పోరాడుతున్న



ఆలయ భూముల సమగ్ర సర్వే చేయాలని అధికారుల చుట్టూ పదిహేనేళ్లుగా తిరుగుతున్నా. కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. మన్‌మర్రి శివారులో 5 ఎకరాలు ఆక్రమణకు గురైంది. ఇప్పటికైనా సమగ్ర సర్వే చేసి హద్దులు నిర్ణయించాలి.

- కేశవాచార్యులు, రంగనాథ స్వామి ఆలయ పూజారి, రంగదాముల

షాద్‌నగర్ నియోజకవర్గంలో వెయ్యి ఎకరాలు

సమగ్ర సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని డిమాండ్

40 ఏళ్లుగా వివాదంలో రంగ నాయక స్వామి ఆలయ భూమి

ఆ ల్యాండ్ విలువ రూ. 2.50 కోట్లకు పైగానే..

షాద్‌నగర్‌రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నియోజకవర్గంలో దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న దేవాలయాలకు చెందిన భూములు వెయ్యి ఎకరాలకు పైగా ఉన్నాయి. ఆ భూములు భద్రంగానే ఉన్నాయా అనే అనుమానాలను భక్తులు వ్యక్తం చేస్తున్నారు. దేవుళ్లకు దీప, ధూప నైవేద్యాలు నిత్యం జరుగాలనే సదాశయంతో నాటి కాకతీయ రాజులతో పాటు అనేక మంది దాతలు వందల ఎకరాల భూములను దేవాలయాలకు ధారాదత్తం చేశారు. అయితే షాద్‌నగర్ ప్రాంతం అంతర్జాతీయ విమాశ్రాయానికి, రాష్ట్ర రాజధానికి చేరువలో ఉండటంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఎకరం ధర కోట్లలో పలుకుతుంది. దేవాలయ భూములకు ప్రతీఏడాది వేలంపాట ద్వారా కౌలుకు ఇస్తున్న సంబంధిత అధికారులు భూముల రక్షణ విషయంలో అంతగా దృష్టి పెట్టడం లేదనే

మిగతా 8వ పేజీలో...

దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డిఅర్బన్/యాచారం. జూలై 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బేగంపేట పబ్లిక్‌స్కూల్‌లో 1వ తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 8వ తేదీ సాయంత్రం వరకు షెడ్యూల్ కులాల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారులు సూచించారు. అర్హులైన వారికి 11వ తేదీ సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. రేషన్, ఆధార్ కార్డులు కులం, ఆదాయం, స్థానిక బర్త్ సర్టిఫికెట్లపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించి దరఖాస్తుతో జత చేయాలన్నారు. ఒక కుటుంబ నుంచి ఇద్దరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు సమర్పించే సమయంలో ఒరిజినల్ పత్రాలు కలెక్టర్ కార్యాలయంలో చూపాలన్నారు. అలాగే ఈ పాఠశాలలో లంబాడ 4, ఎరుకల 1, ఇతర కులాలకు ఒకటి ఖాళీలున్నాయని, ఆసక్తి ఉన్న గిరిజన బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దరఖాస్తులను కలెక్టర్‌లోని గిరిజనాభివృద్ధి శాఖ కార్యాలయంలో 8వ తేదీ సాయంత్రం వరకు అందించాలన్నారు. 12న అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు.

సాగు భూములు తీసుకుంటే ఊరుకోం

» ప్రభుత్వంపై దెబ్బడగూడ రైతుల ఆగ్రహం

» హద్దులు గుర్తించడానికి వచ్చిన అధికారుల అడ్డగింత



అధికారులతో వాగ్వాదం చేస్తున్న దెబ్బడగూడ రైతులు

కందుకూరు, జూలై31(ఆంధ్రజ్యోతి) : సాగులో ఉన్న భూములను టీజీఐఐసీకి కేటాయించడంపై మండల పరిధిలోని దెబ్బడగూడ రైతులు ఆందోళనకు దిగారు. గురువారం హద్దులు నాటడానికి వచ్చిన రెవెన్యూ, పోలీస్ అధికారులను వారు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ముచ్చర్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 123లో 580 ఎకరాల ప్రభుత్వ భూమిని టీజీఐఐసీకి కేటాయించారు. ఇందులో మూడు ఎకరాలు తక్కువగా వస్తుందని గురువారం రెవెన్యూ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి హద్దులు గుర్తించడానికి వచ్చారు. ఈ మూడు ఎకరాలు దెబ్బడగూడ రెవెన్యూలోని 31 సర్వే నంబర్‌లో ఉందని హద్దులు పెట్టడానికి వచ్చారు. అయితే ఈ సర్వే నంబరులో రైతులు రమావత్ జైపాల్‌నాయక్, ఆర్. రాములునాయక్, రాజేందర్‌రెడ్డి, శంకర్‌నాయక్, చేగూరి కిష్టయ్య, బీరప్ప, మల్లేషలకు 21ఎకరాల 23గుంటల పట్టా భూములు ఉన్నాయి. వీరు ఈ భూములను కొన్నేళ్ల నుంచి సాగు చేసుకుంటున్నారు. అయితే సర్వే ప్రకారం ముచ్చర్లలోని తక్కువ వస్తున్న మూడెకరాల భూమి ఈ దెబ్బగూడలో ఉందని అధికారులు హద్దులు నాటడంపై రైతులు వ్యతిరేకించారు. అధికారులను వారు అడ్డుకొని నిరసన తెలిపారు. అంతకుముందు రమావత్ జైపాల్ నాయక్‌ను ఉదయం హౌజ్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ సర్వేయర్ శ్రీనివాస్, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ముచ్చర్లలో తక్కువగా వస్తున్న మూడు ఎకరాల భూమిని గుర్తించడానికి వచ్చామని, రైతులకు ఏమైనా అనుమానాలు ఉంటే సర్వేకు డీడీ కట్టాలని సూచించారు. అనంతరం సరిహద్దులో వివాదంలో దెబ్బడగూడ రెవెన్యూలో వచ్చిన భూములను అధికారులు హద్దులు కేటాయించడానికి పనులు ప్రారంభించారు. మహేశ్వరం అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ జానకీరెడ్డి, సీఐ సీతారాం, తహసీల్దార్ కె.గోపాల్ పాల్గొన్నారు.



యంత్రాన్ని ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ

చెత్త వేరుచేసే యంత్రంతో ఆదాయం

» ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్

ఆదిభట్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్త వేరుచేసే యంత్రంతో మున్సిపల్‌కు దండిగా ఆదాయం సమకూరుతుందని ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్ 6వ వార్డులో రూ.కోటి నిధులతో ఏర్పాటు చేసిన ఈ యంత్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 15 వార్డుల్లో ప్రతీరోజు 10 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నామని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులకు తడి, పొడి చెత్త వేరు చేయడం కష్టతరంగా మారిందని తెలిపారు. చెత్తను వేరు చేయడానికి మున్సిపల్ జనరల్ నిధులతో విభజన యంత్రం ఏర్పాటు చేయడంతో ఇప్పుడిక ఆ ప్రక్రియ సులభతరంగా మారనుంది. డంపింగ్ యార్డులో ఉత్పత్తి చేసిన వర్మీ ఎరువును, పొడి చెత్తను కూడా బహిరంగ మార్కెట్‌లో విక్రయించడం ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో డీఈ స్వర్ణకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, మున్సిపల్ సిబ్బంది నరేందర్, సురేష్, మల్లారెడ్డి, రాజశేఖర్, రమేష్, యాదయ్య పాల్గొన్నారు.

శాంతిభద్రతల కోసం సిబ్బందిని పెంచండి

» కొత్తూర్-నందిగామ పీఎస్‌లను షాద్‌నగర్ డివిజన్‌లో విలీనం చేయండి

» సైబరాబాద్ సీపీని కోరిన ఎమ్మెల్యే వీర్లపల్లి



సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతికి శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని కొత్తూర్, నందిగామ పోలీస్ స్టేషన్లను తిరిగి షాద్‌నగర్ పోలీస్ డివిజన్‌లో విలీనం చేయాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతిని కోరినట్టు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన సైబరాబాద్ సీపీ కార్యాలయానికి వెళ్లి మహంతిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తూర్, నందిగామా పోలీస్ స్టేషన్లను షాద్‌నగర్ ఏసీపీ పరిధి నుంచి శంషాబాద్ ఏసీపీ పరిధిలో విలీనం చేసిన తరువాత ఇబ్బందులవుతున్నాయని, ఆ రెండు మండలాల పోలీస్ స్టేషన్లను తిరిగి షాద్‌నగర్ ఏసీపీ పరిధిలోనే విలీనం చేయాలని కోరినట్టు తెలిపారు. అలాగే డేటా సెంటర్లు, ఆర్వోబీలు, పరిశ్రమల విస్తరణతో జన సంచారం పెరిగిన షాద్‌నగర్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ సిబ్బందిని పెంచాలని కోరినట్టు తెలిపారు. అలాగే మత్తు పదార్థాల విక్రయాన్ని కట్టడి చేయాలని కోరగా... ఇందుకు సీపీ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే వీర్లపల్లి తెలిపారు.

పారిశుధ్య కార్మికురాలికి ఉచితంగా ఇంటి స్థలం

» రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లు మంజూరై ఇంటి స్థలం లేక ఇబ్బంది పడుతున్న మండల పరిధిలోని దేవుని ఎర్రవల్లి గ్రామానికి చెందిన తూర్పటి అండాలుకు లక్షల రూపాయల విలువ చేసే ఇంటి స్థలాన్ని ఉచితంగా ఇచ్చేందుకు రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి ముందుకు వచ్చారు. ఈ మేరకు గురువారం 60 గజాల స్థలాన్ని చేవెళ్ల తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసి డాక్యుమెంట్‌ను మున్సిపల్ కమిషనర్ వెంకటేశం సమక్షంలో కార్మికురాలికి అందజేశారు. ఆమె దేవుని ఎర్రవల్లిలో పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తుంది. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చంద్రయ్య తదితరులు ఉన్నారు.



పట్టాను అందజేస్తున్న సత్యనారాయణరెడ్డి



రైతులతో కలిసి ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

యూరియా పంపిణీ చేయాలని ఆందోళన

తలకొండపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీ చేయాలని కోరుతూ తలకొండపల్లి మండల పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి బీజేపీ నాయకులు గురువారం ధర్నా చేపట్టారు. గోదాంలో యూరియా సరిపడా ఉన్నా రైతులకు ఇవ్వడం లేదని వారు ఆరోపించారు. అనంతరం అధికారులతో మాట్లాడి రైతులకు యూరియా అందేలా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శానమోని పాండు, పద్మ అనిల్, శివ, వినయ్, నీలకంఠ పాండు, మంజుల, శ్యామల, నర్సింహ్మ, చందునాయక్, జంగయ్య, కృష్ణయ్య ఉన్నారు.

కన్నేసి.. తస్కరించారు

రూ.15లక్షలు, 16తులాల బంగారం అపహరణ

మామిడిపల్లిలో భారీ చోరీ .. ఆలస్యంగా వెలుగులోకి

7

బీసీల రాజ్యాధికారమే లక్ష్యం

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అభ్యర్థిని నిలుపుతాం
- బీసీ సదస్సులో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



బీసీ రిజర్వేషన్ సాధన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

ఘట్‌కేసర్ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): బీసీలకు రాజ్యాధికార సాధనే తన లక్ష్యమని, రానున్నది బీసీల రాజ్యం అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. పోచారం మున్సిపాలిటీ కొర్రెములలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో గురువారం బీసీ పొలిటికల్ జేఏసీ కో-ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ సూదగాని హరిశంకర్‌గౌడ్ ఆధ్యక్షతన నిర్వహించిన బీసీ రిజర్వేషన్ సాధన సదస్సుకు మల్లన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల యుద్ధం మొదలైందని, అందులో తీన్మార్ మల్లన్న టీం సభ్యులు ముఖ్య భూమిక పోషించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు 42శాతం రిజర్వేషన్ పేరుతో డ్రామాలాడుతున్నారని విమర్శించారు. ఈ రిజర్వేషన్ల అమలు సీఎం తరం కాదన్నారు. తెలంగాణ ఉద్యమంలో 1,200 మంది బడుగు బలహీన వర్గాల బిడ్డలు ఆత్మ బలిదానం చేశారన్నారు. ఇప్పుడు బీసీ ఉద్యమంలో ఓసీలు బలిదానం చేసుకొని బీసీలకు రిజర్వేషన్లు సాధించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లో బీసీ పార్టీలే అధికారంలోకి వస్తాయని, అప్పుడు ప్రగతి భవన్, ఎన్టీఆర్(టీడీపీ) భవన్, తెలంగాణ(బీఆర్ఎస్) భవనాలను గుంజుకుంటామన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తమ అభ్యర్థిని నిలిపి గెలిపించుకుంటామన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలు సత్తాచాటుతారని తెలిపారు. నెల రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి బీసీ జేఏసీలను ఏర్పాటు చేస్తామని, త్వరలోనే పార్టీని ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జానయ్యయాదవ్,నారగోని, సూర్యారావు, ఓదేలు, నర్సయ్యగౌడ్, ఇందిర, రజనికుమార్, భావన, కొంటడన్న, రమేష్ పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలి



విరాళం అందజేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధి, దైవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని టాస్క్, సీపీవో, ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. సన్మార్గంతోనే దైవానుగ్రహం సంక్రమిస్తుందని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, వెల్దండ మండలాల్లో గురువారం పర్యటించారు. కుందారం తండాలో నిర్మిస్తున్న వీరాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి రాఘవేందర్‌రెడ్డి తన ఫౌండేషన్ తరఫున రూ. 2.5లక్షల విరాళాన్ని ప్రకటించారు. మొదటగా రూ.లక్ష చెక్కును అందజేశారు. ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డిని ఆలయ నిర్వాహకులు, తండా నాయకులు పూల మాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవితాన్ని పొందుతారన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, తండాలు, గ్రామాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు గన్యానాయక్, సవేందర్, లోక్యా, మోతిలాల్, భాగ్య, లోకేశ్, సోమ్లు, శంకర్, నవీన్, సురేశ్, ప్రవీణ్, మహేశ్ పాల్గొన్నారు.

పేదల ఆత్మగౌరవం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం



రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న క్యామ రాజేశ్, బోసు రవి

కడ్తాల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పేదల ఆత్మగౌరవం పెంపే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, మండల అధ్యక్షుడు బోసు రవి అన్నారు. నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇస్తుందని పేర్కొన్నారు. కడ్తాలలో గురువారం రవి అధ్వర్యంలో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఆహార భద్రత కార్డులు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ పాలనలో రేషన్‌కార్డులు ఇవ్వలేదన్నరు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గం వేగంగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. అభివృద్ధిలో ప్రజలంతా పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గఉపాధ్యక్షుడు ఇమ్రాన్‌బాబ, పట్టణాధ్యక్షుడు భానుకిరణ్, శ్రీకాంత్, రమేశ్, మహేశ్, నర్సింహ శ్రీను పాల్గొన్నారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి



కీసరలో మొక్క నాటుతున్న ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి

కీసర, జూలై31(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని కీసర రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా కమిషనర్ వెంకట్‌రెడ్డి అధ్వర్యంలో గురువారం కీసరలో మొక్కలను నాటారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఆర్డీవో మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషిచేయాలన్నారు. మొక్కలను వృక్షాలుగా మలిచి భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం ఛైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రాజీవ్ యువ వికాసం అందించాలి

- బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ



కేశంపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రాజీవ్ యువ వికాసం పథకంలో ఆర్థిక సాయం అందించాలని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మల్హాంకర్ శివాజీ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన గురువారం మాట్లాడారు. నిరుద్యోగ యువత ఉపాధికి రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తానని ప్రభుత్వం చెప్పిందని వివరించారు. రాజీవ్ యువ వికాసం కింద ఆర్థిక సాయం అందించి దరఖాస్తులు స్వీకరించినా ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. జూన్ 2 నుంచి అమలు చేస్తామని పథకం జూలై ముసిగినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వెంటనే రాజీవ్ యువ వికాసం రుణాలు ఇవ్వాలని కోరారు.

పశువుల అపహరణకు వచ్చి గేదెను చంపిన దొంగలు



తాడు వేసి లాగడంతో మృతిచెందిన గేదె

షాద్‌నగర్ రూరల్, జూలై31(ఆంధ్రజ్యోతి): పశువుల అపహరణకు వచ్చిన దొంగలు గేదె ప్రాణం తీసిన ఘటన షాద్‌నగర్ పరిధి జోగమ్మగూడ శివారులో బుధవారం రాత్రి జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బోటిగూడెం నర్సింలు తన నాలుగు ఆవులు, మరో నాలుగు గేదెలను పొలం వద్ద కట్టేశాడు. అర్ధరాత్రి పశువుల అరుపులు విన్పించడంతో నర్సింలు కొట్టం వద్దకు వెళ్లాడు. దొంగలు అతడిని గమనించి తాము వచ్చిన వాహనంలో పారిపోయారు. కొట్టంలో అప్పటికే గేదె మృతి చెందింది. మెడకు తాడు కట్టి ఉంది. నర్సింలు సమాచారంతో గ్రామస్తులు చేరుకున్నారు. పశువుల దొంగలు జోగమ్మగూడ నుంచి రాయికల్ వైపు వెళ్లినట్లు తెలిపారు. పశువులను అపహరించచేందుకు ప్రయత్నించగా అవి చెల్లాచెదురుగా పారిపోవడంతో సాధ్యం కాలేదు. గతంలో రాయికల్‌కు చెందిన పాండు పొలం నుంచి రెండు ఆవులను దొంగలు ఎత్తు కెళ్లారు. కాగా బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'మద్యం పాలసీ ఆమోదం సరి కాదు'

కొడంగల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువస్తున్న మద్యం పాలసీని క్యాబినెట్ ఆమోదించడం సరైంది కాదని సీపీఐ నియోజకవర్గ నాయకుడు జి.సురేశ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మద్యంతో కుటుంబాలు విచ్ఛిన్నం అవుతుంటే.. ప్రజాపాలన పేరుతో ప్రజలను మత్తులో ముంచి ఆదాయం దండుకునేందుకు ఇంటికి మద్యాన్ని సరఫరా చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.

రిటైర్మెంట్ జీవితాన్ని ప్రశాంతంగా గడపాలి



డ్రైవర్ ఈశ్వర్‌కు జ్ఞాపికనందించి సత్కరించిన డీపీఆర్‌వో సిబ్బంది

రంగారెడ్డిఅర్బన్/యాచారం, జూలై 31(ఆంధ్ర జ్యోతి): ఉద్యోగ విరమణ అనంతరం జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని రంగారెడ్డి డీపీఆర్వో సి.వెంకటేశం అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో డ్రైవర్ ఈశ్వర్ గురువారం ఉద్యోగ విరమణ పొందారు. సిబ్బంది ఆయనకు జ్ఞాపికనందించి శాలువాలు. పూలమాలలతో సత్కరించారు. డీపీఆర్వో మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగికి బదిలీలు, రిటైర్మెంట్‌లు తప్పనిసరన్నారు. ఈశ్వర్ భవిష్యత్తు జీవితం ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. కార్యాలయ సిబ్బంది, యూనియన్ అధ్యక్షుడు కుమార్, ఉపాధ్యక్షుడు అనంతరెడ్డి, ఈశ్వర్ కుటుంబీకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజమే



ఉద్యోగ విరమణ పొందిన రవీందర్ దంపతులను సన్మానిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, అధికారులు

చేవెళ్ల, జూలై31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ తప్పదని, అది సహజమేనని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. చేవెళ్ల మండల పరిషత్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన రవీందర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం గురువారం చేవెళ్లలోని ఈశ్వరి బాంక్వెట్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌ను ఎమ్మెల్యే, జెడ్పీసీఈవో, డిప్యూటీ సీఈవో రంగారావు, పలు మండలాల ఎంపీడీవో, ఉద్యోగులు సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల పరిష్యత్ కార్యాలయంలో అందరితో రవీందర్ మంచి అధికారిగా గుర్తింపు పొందారన్నారు. 35ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసిన ఆయన సేవలు గొప్పవని కొనియాడారు. ఉద్యోగ విరమణ తర్వాత శేషజీవితాన్ని ఆరోగ్యంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో హిమబిందు, వెంకటయ్య, ముడిమ్యాల్ ప్యాక్స్ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాదయాత్ర ఒక దొంగ నాటకం

- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి ఇప్పుడు పాదయాత్రతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ లబ్ధికోసమే జనహిత పాదయాత్ర చేస్తున్నారని ఆరోపించారు. గతంలో రాహుల్‌గాంధీ పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని.. రైతులు, నిరుద్యోగులు విద్యార్థులు, మహిళలు రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్నారని తెలిపారు. ప్రభుత్వం పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలి కానీ, పాదయాత్రలతో ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ ధోరణిగా మారిందని, స్థానిక ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

సుప్రీం కోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత విషయమై స్పీకర్ 3 నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు పేర్కొనడాన్ని స్వాగతిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తెలిపారు. ఫిరాయింపులను నియంత్రించకుంటే ప్రజాస్వామ్యానికే ప్రమాదమని, ప్రజలతీర్పునకు ప్రయోజనం లేకుండాపోయే ఆస్కారం ఉందని అభిప్రాయపడ్డారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కేశవులు

ప్రజల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

ఆమనగల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పాలన సాగిస్తోందని, ప్రజల ఆర్థికాభివృద్ధి, జీవన ప్రమాణాల పెంపే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పథకాలను అమలు చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, ఆమనగల్లు ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డిపల్లిలో గురువారం పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆధ్వర్యంలో రూ.25కోట్లతో ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మాజీ సభ్యుడు ఖాదర్‌ఖాద్రి, శ్రీనునాయక్, చంద్రయ్య, జానీ పాల్గొన్నారు.



మేస్త్రీలు, కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామకృష్ణ

బాలల హక్కులను కాపాడాలి

ఇబ్రహీంపట్నం, జూలై 31(ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా బాలల హక్కులను కాపాడుతూ వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ఇబ్రహీంపట్నం ఎస్సై రామకృష్ణ అన్నారు. ఆపరేషన్ ముస్కాన్-11లో భాగంగా రాచకొండ మానవ అక్రమ నిరోధక విభాగం, డివిజన్ ముస్కాన్ టీం ఆధ్వర్యంలో గురువారం మంగల్‌పల్లిలోని భవనాల నిర్మాణ ప్రాంతాల్లో మేస్త్రీలు, కూలీలకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. బడీడు పిల్లలు బడుల్లో ఉండాలని, వారిరో పనులు చేయించకూడదని సూచించారు. 14ఏళ్ల వయసులోపు పిల్లలతో పనులు చేయిస్తే నేరమనే విషయం తెలుసుకోవాలన్నారు. చైల్డ్‌లైన్ ఎన్‌జీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లును ఆమోదించాలి

- రాజకీయ పార్టీలు డ్రామాలను కట్టిపెట్టాలి
- బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్

తాండూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలన్నీ బీసీ బిల్లు విషయంలో డ్రామాలు ఆపాలనీ, చిత్త శుద్ధి ఉంటే బీసీ బిల్లు అమలు చేయించి, 42శాతం రిజర్వేషన్లను వర్తింపజేయాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం తాండూరులో ఓ ప్రకటన విడుదల చేశారు. రాజకీయాల కోసం రాజకీయ పార్టీలు బీసీ బిల్లును వాడుకుంటున్నాయని పేర్కొన్నారు. బీసీ బిల్లు విషయంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల వైఖరి సరిగా లేదని విమర్శించారు. అన్ని పార్టీలు బిల్లు ఆమోదానికి చొరవ చూపాలని, లేకుంటే మరో బీసీ ఉద్యమం తప్పదని పేర్కొన్నారు. 42శాతం రిజర్వేషన్ల బిల్లు అసెంబ్లీలో పాసైనా గవర్నర్ ఆమోదం కోసం ఎదురు చూడవలసి వస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చేందుకు కొర్రీలు పెడుతోందని విమర్శించారు.

ముఖ గుర్తింపుతో పెన్షన్ల పంపిణీ

కొడంగల్ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): వృద్ధులకు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లను ముఖ గుర్తింపు యాప్ ద్వారా అందిస్తున్నారు. టేకుల్‌కోడ్‌లో గురువారం బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ మల్లేశం ప్రభుత్వం రూపొందించిన ముఖ గుర్తింపు ప్రత్యేక యాప్ ద్వారా పెన్షన్లు పంపిణీ చేశారు. గతంలో పెన్షన్‌దారులు బయోమెట్రిక్ వేలిముద్ర ద్వారా పింఛన్లు ఇచ్చేవారు. అయితే కొన్నిసార్లు వేలిముద్రలు ఓకే కాక పెన్షన్ ఇవ్వడంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో ప్రభుత్వం ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. టేకుల్‌కోడ్, టేకుల్‌కోడ్ తండా, మోత్కుల బండ తండా, బోయపల్లి తండాలకు వారికి పెన్షన్ అందజేస్తామని తెలిపారు.



ఫేషియల్ రికగ్నిషన్ చేస్తున్న పోస్ట్ మాస్టర్



ఘనంగా భూలక్ష్మీదేవి మహోత్సవాలు

మేడ్చల్ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలోని గోసాయిగూడలో గురువారం భూలక్ష్మీదేవి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున వచ్చి పూజలు చేశారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ పూజలు నిర్వహించారు. స్థానికులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



నాయకులకు స్వాగతం పలుకుతున్న ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు

(ఐదో పేజీ తరువాయి)

సాయంత్రం 5.35 గంటలకు చేరుకున్నారు. వారికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. 5.50 గంటలకు ప్రారంభమైన పాదయాత్ర రాత్రి 7.20 గంటలకు కొడంగల్ చౌరస్తాకు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మహేశ్ కుమార్‌గౌడ్, మీనాక్షీ నటరాజన్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. సమావేశం ముగిసిన తర్వాత అక్కడి నుంచి ఎస్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌కు చేరుకున్నారు. అక్కడ కాసేపు పార్టీ నేతలతో మాటామంతి నిర్వహించారు. ముఖ్య నేతలంతా అక్కడే డిన్నర్ ముగించుకొని నిద్రకు ఉపక్రమించారు. పాదయాత్రలో మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీలు వి.హన్మంత్‌రావు, మధుయాష్కీగౌడ్, రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, మల్‌రెడ్డి రంగారెడ్డి, పర్ణికారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, జాతీయ యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కోలుకుంద సంతోష్‌కుమార్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధ్యక్షులు నర్సింహారెడ్డి, హరివర్ధన్‌రెడ్డి, పంచాయతీ రాజ్ సంఘటన రాష్ట్ర అధ్యక్షుడు రాచమళ్ల సిద్ధేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రమదానం

పాదయాత్ర రెండో రోజైన నేడు(శుక్రవారం) ఉదయం పరిగి మున్సిపల్ పరిధిలోని గిరిజన బాలికల పాఠశాల/కళాశాల ఆవరణలో శ్రమదానం నిర్వహించనున్నారు. అనంతరం అక్కడ మొక్కలు నాటనున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌తో పాటు, ఇతర ముఖ్య నేతలు పాల్గొననున్నారు. పది గంటలకు పరిగిలోని ఎస్ గార్డెన్‌లో ఉమ్మడి జిల్లా పార్టీ ముఖ్య నేతలతో సమావేశం జరగనుంది.



పాదయాత్రలో నాయకులకు రక్షణ వలయంలా ఏర్పడిన పోలీసులు

ట్రాఫిక్ జామ్... వాహనదారుల తిప్పలు

పాదయాత్ర సందర్భంగా పరిగి నుంచి రంగాపూర్ వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రంగాపూర్ వైపు వాహనాలు వెళ్లకుండా పరిగిలోనే నిలిపివేశారు. కొన్ని వాహనాలను నస్కల్ - వికారాబాద్ మార్గంలో మళ్లించారు. జాతీయ రహదారిపై ఒకవైపు పాదయాత్ర కొనసాగుతుండగా మరోవైపు వాహనాలను అనుమతించారు. పాదయాత్రలో రద్దీ అధికంగా ఉన్న చోట్ల మాత్రం వాహనాలను అనుమతించలేదు. పాదయాత్ర ప్రారంభమయ్యే సమయంలో రంగాపూర్‌లో స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. కాగా, పాదయాత్రలో తోపులాట జరగకుండా పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఎస్పీ నారాయణరెడ్డి నేతృత్వంలో డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలతో పాటు పోలీసు సిబ్బందిని భారీగా మోహరించారు.



త్వరలో ఆర్వోబీ పనులు?

- రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ 92.79కోట్లు మంజూరు?
- టెండర్ల ఆహ్వానానికి రైల్వే అధికారుల ఏర్పాట్లు

అయోధ్య చౌరస్తా రైల్వే గేటు సమస్యకు మోక్షం

మేడ్చల్ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న గుండ్లపోచంపల్లి మునిసిపాలిటీ అయోధ్య చౌరస్తాలోని రైల్వే లెవల్ క్రాసింగ్ సమస్య పరిష్కారం కానుంది. రైల్వే గేటు వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి(ఆర్ఓబీ) కట్టాలని ఏళ్లుగా స్థానికులు, వాహనదారులు రైల్వే శాఖను కోరుతున్నారు. రైల్వే గేటు పడితే గంటల తరబడి నిరీక్షించడంతో పాటు రెండు వైపులా కిలోమీటర్ల పొడవున వాహనాలు నిలుస్తున్నాయి. ఆర్వోబీ నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే శాఖ రూ.92.79కోట్లు(ఎల్‌సీ నంబరు 246ఎ) మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిసింది. ఆదేశాలు జారీచేసి రోజులు గడుస్తున్నా రైల్వే అధికారులు మాత్రం ఇంకా ప్రకటించలేదు. కాగా ఆర్వోబీకి నిధులు మంజూరు చేశారని అధికారులు, బీజేపీ నాయకులు స్పష్టం చేస్తున్నారు. ఆర్వోబీ నిర్మాణంతో వాహనదారుల సమస్య తీరుతుందని స్థానిక బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. గుండ్ల పోచంపల్లి పరిధి అయోధ్య చౌరస్తా వద్ద ఉన్న రైల్వే గేటుతో ఏళ్లుగా స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. మేడ్చల్-గండిమైసమ్మ చౌరస్తా రోడ్డులో ఉన్న ఈ రైల్వే గేటు మీదుగా రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గుండ్లపోచంపల్లి, గౌడవెల్లి, కండ్లకోయ, సుతారిగూడ, అయోధ్య చౌరస్తా ప్రాంతాల్లో భారీ సంఖ్యలో పరిశ్రమలు, గోడౌన్లు ఉన్నాయి. కాలేజీలు, ఇతర విద్యా సంస్థలూ ఉన్నాయి. ఈ రోడ్డుగుండా వెళ్తున్న వాహనదారులకు రైల్వే గేటు పడుతున్న సమయంలో బాగా ఆలస్యం అవుతోంది. రైళ్ల రాకపోకలు, క్రాసింగ్‌లు, వరుసగా ట్రైన్లు వస్తుంటే గంటల తరబడి రోడ్డుపై నిలిచిపోతున్నారు. వాహనాలు కిక్కిరిసి ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది రైల్వే గేటును తప్పించుకునేందుకు వేరేమార్గాల్లో వెళ్తున్నారు. అలాంటి వారికి దూరాభారం పెరుగుతోంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మిస్తారనే వార్త ప్రచారమవుతుండడంతో సంతోషిస్తున్నారు.



అయోధ్య చౌరస్తా వద్ద రైల్వే గేటు

పనులు చేపడితే ప్రత్యామ్నాయ మార్గంగా ఔటర్

ఆర్ఓబీ పనులు ప్రారంభిస్తే మేడ్చల్-గండిమైసమ్మ మార్గంలో తిరిగే వాహనాలు ఓఆర్ఆర్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. మియాపూర్, గండిమైసమ్మ చౌరస్తాల వచ్చే వాహనాలైనా, మేడ్చల్, శామీర్‌పేటల నుంచి గండిమైసమ్మ చౌరస్తా వైపు వెళ్లేవైనా ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. అయితే వాహనాల ఎంట్రెన్స్, ఎగ్జిట్లు ఎక్కడ అనేది అధికారులు నిర్ధారించాల్సి ఉంది. ఇదిలా ఉంటే ద్విచక్ర వాహనాలకు ఓఆర్ఆర్‌పై అనుమతి లేనందున వారు కొంపల్లి, దూలపల్లి మీదగా వెళ్లాలి. మేడ్చల్ వాసులు గిర్మాపూర్, రాయిలాపూర్‌ల మీదగా దుండిగల్, లేదా అయోధ్య చౌరస్తాలకు వెళ్లాల్సి ఉంటుంది. గుండ్లపోచంపల్లి వైపు నుంచి మేడ్చల్ రావాల్సిన ద్విచక్ర, చిన్నపాటి వాహనాలు(కార్లు) అయోధ్య చౌరస్తా వయా రాయలాపూర్ నుంచి చేరుకుంటాయి.

ఫలించిన ఎంపీ ఈటల ప్రయత్నం

ఆర్‌ఓబీ నిర్మించాలని స్థానికులు మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు పలు మార్లు వినతిపత్రాలను అందజేశారు. ఆయన ఢిల్లీ వెళ్లినప్పుడల్లా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీవైష్ణవ్‌ను కలిసి ప్రజల ఇబ్బందులు, ఆర్వోబీ నిర్మించాల్సిన ఆవశ్యకతపై వివరించి వినతిపత్రాలు ఇచ్చారు. ఇటీవలే ఎంపీ ఈటల రైల్వే శాఖ మంత్రితో ఆర్వోబీపై చర్చించారు. దీంతో మంత్రి దక్షిణ మధ్య రైల్వే అధికారులకు ఆదేశాలు జారీచేయగా వారు నిధులు మంజూరు చేసినట్టు సమాచారం. ఆర్వోబీ పనుల అప్పగింతకు త్వరలోనే టెండర్ కాల్‌ఫర్ చేస్తారని తెలుస్తోంది. పదేళ్లుగా ఈ సమస్య తీవ్రమైంది. ఎంపీ ఈటల ప్రత్యేక దృష్టితో పరిష్కారం కానుందని స్థానిక బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు.



ఎల్లయ్యను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి సహజం

డీసీఎంఎస్ రంగారెడ్డి జిల్లా బిజినెస్ మేనేజర్ రమణారెడ్డి

వికారాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పదవీ విమరణ ప్రతి ఉద్యోగికి సహజమని, ఉద్యోగ జీవితంలో చేసిన మంచి పనులు ఎప్పటికీ గుర్తుంటాయని డీసీఎంఎస్ రంగారెడ్డి జిల్లా బిజినెస్ మేనేజర్ చొప్పరి రమణారెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ చొప్పరి ఎల్లయ్య పదవీ విరమణ సందర్భంగా ఎల్లయ్య, లక్ష్మీ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లయ్య కార్యాలయంలో కలుపుగోలుగా ఉంటూ సహచరులతో పనులు చేయించేవారన్నారు. తాండూరు డీసీఎంఎస్‌లో పని చేసే సమయంలో రైతుల వద్ద కొనుగోలు విషయంలో కలెక్టర్ ప్రశంసలు అందుకున్నారన్నారు. ఉద్యోగంలో మంచి పేరు తెచ్చుకున్న మాదిరిగానే తన శేష జీవితాన్ని కూడా సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొట్టిముక్కుల శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు నర్సింహారెడ్డి, నర్సింహులు, అరవింద్‌రావు, మునిసిపల్ మాజీ చైర్మన్ అశోక్, మాజీ గ్రంథాలయ చైర్మన్ గుడిసె లక్ష్మణ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఆర్.ఆంజనేయులు, సురేందర్, నాయకులు ఆర్.శ్రీనివాస్, మల్లేశం, పాండు, విఠలయ్య, అనంతయ్య, పర్మయ్య పాల్గొన్నారు.

టీబీపై అవగాహన కలిగి ఉండాలి

కోట్‌పల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): టీబీపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ మేఘన అన్నారు. గురువారం రాంపూర్‌లో టీబీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీబీతో పాటు రక్తపోటు, మధుమేహం, వంటి తదితర వ్యాధుల గురించి వివరించారు. డాక్టర్ మాట్లాడుతూ.. టీబీ లక్షణాలున్న వారికి ఆరు నెలల వరకు ఉచితంగా మందులు, నెలకు రూ.వెయ్యి ఇస్తామని తెలిపారు. మందులు క్రమం తప్పకుండా వాడాలని గుర్తుచేశారు. 85మందికి ఓపీ చూసి 16మందిని ఎక్స్‌రేల కోసం పంపినట్లు తెలిపారు. 30 మంది స్పూటం శాంపిల్స్ తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఖయ్యూం, ఎంఎల్‌ఎచ్‌పీ దివ్య, టీబీ సిబ్బంది అశోక్, రాజేందర్, ఏఎన్ఎం అంజలి, ఆశా వర్కర్లు విజయమ్మ, శోభ, అండాలు పాల్గొన్నారు.

మద్యం తాగుతూ వ్యక్తి మృతి

- కల్తీ మద్యమే కారణమని ఆందోళన

శంషాబాద్ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మద్యం తాగుతూ వైన్స్ వద్ద ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం మండల పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూర్ మండలం అక్కినేనిగూడకు చెందిన సోలిపురం సాయిలు(48) సాయంత్రం కవేలిగూడలోని వైన్స్‌లో మద్యం తాగేందుకు వెళ్లాడు. పర్మిట్ రూంలో మద్యం తాగుతూ పడిపోయి మృతిచెందాడు. దీంతో వైన్స్ యజమాని పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించారు. అక్కడికి చేరుకున్న సాయిలు కుటుంబీకులు రోదిస్తూ.. కల్తీ మద్యం వల్లే చనిపోయాడని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు. కాగా పోలీసులు అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా విచారణ చేస్తామని సీఐ తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.



మృతుడు సాయిలు

ఎస్‌బీఐ సేవలను వినియోగించుకోవాలి

- సీజీఎం సహదేవన్‌రాధాకృష్ణన్

మొయినాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలనీ ఎస్‌బీఐ చీఫ్ జనరల్‌మేనేజర్(సీజీఎం-తెలంగాణ) సహదేవన్‌రాధాకృష్ణన్ అన్నారు. గురువారం మండల పరిధి తోలుకట్ట గ్రామంలో ఎస్‌బీఐ-మొయినాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆర్థిక అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ సతీష్‌కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ రోహిత్‌కుమార్‌లతో కలిసి హాజరయ్యారు. సహదేవన్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన(పీఎంజేడీవై) ఖాతాలతో పాటు పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలతో ప్రజలు లబ్ధిపొందాలని సూచించారు. బ్యాంకు రుణాలతో ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. ప్రతి ఒక్కరికి జీవిత బీమా చేయించుకోవాలన్నారు. ఒక వ్యక్తి ఏడాదికి రూ.436 చెల్లిస్తే రెండు లక్షల సాధారణ బీమా వర్తిస్తుందని తెలిపారు. సంవత్సరానికి 20 రూపాయాలు చెల్లిస్తే రూ.2లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. 50ఏళ్ల వరకు ఈ బీమా పథకాలు వర్తిస్తాయని చెప్పారు. బ్యాంకు ఖాతాదారులు ప్రతీ పదేళ్లకు ఒకసారి రీ-కేవైసీ చేయించుకోవాలని, నామినీ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. బ్యాంకులను కాపాడుకోవాల్సి బాధ్యత ప్రజలదేనని, తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడారు. కేవైసీ వివరాలను పరిశీలించారు. సైబర్ మోసాల గురించి అవగాహన కల్పించారు. పొదుపు ఖాతాలకు నామినీని తప్పక నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ రీజినల్ మేనేజర్ నితీన్, ఏజీఎం శ్రీహరి, ఎల్‌డీఎం సుశీల్, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, ఏపీఎం రవీందర్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, సత్యనారాయణ, బ్యాంకు అధికారులు రవి, రఘు, సిబ్బంది పాల్గొన్నారు.



తోలుకట్ట శిబిరంలో మాట్లాడుతున్న సీజీఎం సహదేవన్‌రాధాకృష్ణన్

బాలిక కిడ్నాప్ కేసు విచారణ ముమ్మరం

పోలీసుల అదుపులో బాలిక, యువకుడు

బషీరాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): బాలిక కిడ్నాప్ కేసులో బాలికను, ఆమెను వెంట తీసుకెళ్లిన యువకుడిని తాండూరు రూరల్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఈ కిడ్నాప్‌పై రూరల్ సీఐ నగేశ్ నేతృత్వంలో విచారణ చేస్తున్నారు. కిడ్నాప్‌నకు సంబంధించి వివరాలను సేకరించారు. మరింత విచారణ కోసం బాలికను పోలీసులు వికారాబాద్ మహిళా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉంటే తమ కూతురిని కిడ్నాప్ చేసిన యువకుడి కుటుంబీకులు కేసును నీరుగార్చేందుకు తమపై ఒత్తిడి తెస్తున్నారని బాలిక తల్లిదండ్రులు చెబుతున్నారు. బాలిక స్టేట్‌మెంట్ ప్రకారం కేసు సెక్షన్ల మార్పు యోచనలో పోలీసు లున్నట్లు తెలుస్తోంది. దీనిపై బషీరాబాద్ ఎస్సై నుమాన్ అలీని స్పందన కోరగా.. బాలిక అపహరణపై ఇప్పటికే కేసు నమోదు చేశామని, మహిళా స్టేషన్‌లో బాలికను విచారిస్తున్నారని తెలిపారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

మేడ్చల్ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణ పరిధి వినాయక్‌నగర్ రోడ్డు నంబర్ 1లో హోటల్ నిర్వాహకులు రోడ్డుకు ఆనుకొని నిర్మించిన కట్టడాలను గురువారం అధికారులు తొలగించారు. వాహనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఇటీవల ప్రజలు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు స్పందించి నిర్మాణాలను తొలగించారు. ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ అధికారి రాధాకృష్ణ తెలిపారు.



కన్నేసి.. తస్కరించారు

- 15లక్షల నగదు, 16 తులాల బంగారం అపహరణ
- మామిడిపల్లిలో భారీ చోరీ
- ఆలస్యంగా వెలుగులోకి

నందిగామ, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధి మామిడిపల్లిలోని ఓ ఇంట్లో నుంచి దొంగలు గుట్టుగా 15లక్షల నగదు, 16తులాల బంగారు ఆభరణాలను దొంగిలించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిపల్లికి చెందిన కృష్ణయ్య భార్య, కూతురితో జీవనం కొనసాగిస్తున్నాడు. అతడికి కొందుర్గు మండలం మహదేవ్‌పూర్‌లో 2ఎకరాల 20గుంటల పొలం ఉండేది. ఆ భూమి 2021లో రూ.66లక్షలకు విక్రయించాడు. ఆ డబ్బులోంచి రూ.30లక్షలతో షాద్‌నగర్‌లో ఓ ప్లాట్ కొన్నాడు. మిగతా డబ్బుతో కూతురి పెళ్లికని 16తులాల బంగారం కొని, రూ.15లక్షల నగదును ఇంట్లో దాచాడు. ఈ నెల 26వ కృష్ణయ్యకు క్రాప్‌లోన్ రూ.50వేలు కట్టాలని బ్యాంక్ నుంచి ఫోన్ రావడంతో డబ్బులు, బంగారం దాచిన సూట్‌కేస్ తెరిచాడు. అందులో ఏమీ కన్పించలేదు. రెండు నెలలుగా తాము సూట్‌కేస్‌ను తెరవలేదని, డబ్బున్న విషయం తెలిసిన వారే అపహరించారని బాధితులు లబోదిబోమంటున్నారు. డబ్బులు, నగలు దొరుకుతాయని ఇరుగుపొరుగు చేప్తే నాలుగు రోజులుగా మాంత్రికుల వద్దకు వెళ్లారు. అదంతా మోసం అని గ్రహించి గురువారం పోలీసులను ఆశ్రయించారు. కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. కూతురి పెళ్లికి దాచిన డబ్బు, నగలు చోరీకి గురవడంతో కృష్ణయ్య దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు.



పోలీస్ స్టేషన్ వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న బాధిత కుటుంబం

కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు



- షాద్‌నగర్ ఎక్సైజ్ సీఐ శేఖర్

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనతో ఎక్సైజ్‌శాఖ ముమ్మర తనిఖీలు చేపడుతోంది. కల్లు దుకాణాలను పరిశీలిస్తూ, కల్తీ కల్లు శాంపిల్స్‌ను సేకరించిన అధికారులు పరీక్షలకు పంపిస్తున్నారు. ఈక్రమంలో షాద్‌నగర్ ఎక్సైజ్ శాఖ పరిధిలో చేపడుతున్న తనిఖీలు, తీసుకుంటున్న చర్యలపై ఎక్సైజ్ శాఖ సీఐ టి.శేఖర్‌తో 'ఆంధ్రజ్యోతి' ఫటాఫట్ ఇంటర్వ్యూ.

ఫటా ఫట్

ప్రశ్న: షాద్‌నగర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో కల్లు దుకాణాలు ఉన్నాయి?

జవాబు : మొత్తం ఆరు మండలాలలో కలిసి 89 టీఎఫ్‌టీ (ట్రీ ఫర్ ట్యాపర్) లైసెన్స్‌లు కలవు. అలాగే 23 టీసీఎస్ (టాడీ ట్యాపర్స్ కో-ఆపరేటివ్ సొసైటీస్) ఉన్నాయి.

ప్రశ్న: కూకట్‌పల్లి ఘటన తర్వాత చేపట్టిన చర్యలేమిటీ?

జవాబు : షాద్‌నగర్ ఎక్సైజ్ పరిధిలోని అన్ని దుకాణాలను తనిఖీలు చేస్తున్నాం. అనుమానం వచ్చిన దుకాణాల నుంచి శాంపిల్స్‌ను సేకరిస్తున్నాం. ఇప్పటివరకు 31శాంపిల్స్‌ను సేకరించి, పరీక్షల కోసం హైదరాబాద్‌లోని రివిజినల్ ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ లేబరేటరీకి పంపించాం.

ప్రశ్న: కల్తీకల్లు వ్యాపారంపై తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు : తనిఖీల్లో భాగంగా లైసెన్స్‌లేని వనంపల్లి, తిమ్మాపూర్, పాత ఆగిర్యాలలోని కల్లు దుకాణాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశాం. శాంపిల్స్ పంపిన లేబరేటరీ నుంచి రిజల్ట్ రాగానే కల్తీ కల్లు ఉన్నట్టు తేలిన దుకాణాలను సీజ్ చేసి లైసెన్స్‌లు రద్దు చేస్తాం.

ప్రశ్న: ఈత, తాటి చెట్లులేని గ్రామాల్లోనూ కల్లు విక్రయాలను కొనసాగించడాన్ని ఏ విధంగా చూడాల్సి ఉంటుంది?

జవాబు : ఈత, తాటిచెట్లు లేని గ్రామాల కల్లు వ్యాపారులు వంద కిలో మీటర్ల నుంచి కల్లు తీసుకొచ్చి విక్రయించుకునే వెలుసుబాటు ఉంది. ప్రతీ దుకాణదారుడు విధిగా ఈత, తాటి వనాలు ఉన్న ప్రాంతాల నుంచి కల్లు తీసుకువచ్చి విక్రయించాలి. కల్తీకల్లు విక్రయిస్తే చర్యలుంటాయి.

ప్రశ్న: కల్లు వ్యాపారులకు చేస్తున్న సూచనలు ఏమిటి?

జవాబు : లైసెన్స్‌లేని ప్రాంతాల్లో కల్లు విక్రయాలు కొనసాగించొద్దు. కల్తీ కల్లును విక్రయించవద్దు. దుకాణాల్లో పారిశుధ్య చర్యలు పాటించాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆలయాల భూములు పదిలమేనా?

(ఐదో పేజీ తరువాయి)

ఆరోపణలున్నాయి. కొందరు సారవంతమైన భూములు నామ మాత్రపు కౌలు చెల్లిస్తూ ఏళ్లతరబడి సాగుచేసుకుంటున్నారు.



రంగదాములలోని రంగనాథ స్వామి ఆలయ భూములు

ఆలయాలకు వెయ్యి ఎకరాల మాగాణి

కొందుర్గు గ్రామ శివారులో నాటి పెండ్యాల గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మించిన శ్రీలక్ష్మీ నర్సింహాస్వామి ఆలయంలో నిత్యం దీప, ధూప నైవేద్యాలు నిర్వహించేందుకు కాకతీయ రాజులు 313 ఎకరాల భూములను దానమిచ్చారు. ప్రస్తుతం ఆ భూములు బహిరంగ మార్కెట్‌లో ఎకరానికి లక్షల రూపాయలు ఉంది. అయినా దశాబ్దాల కాలం నుంచి ఆ భూములకు నామ మాత్రపు కౌలు చెల్లిస్తూ అనుభవిస్తున్నారు. ప్రతీఏడాది వస్తున్న నామమాత్రపు కౌలు గ్రామంలోని దేవాలయం నిర్వహణ, ఇతర ఖర్చులకే సరిపోతుంది. ఆ భూములను సమగ్ర సర్వే చేయాలని భక్తులు కోరుతున్నారు. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ గ్రామ శివారులోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయానికి 73 ఎకరాల భూములు ఉన్నాయి. సుమారు 700 ఏళ్ల క్రితం నిర్మించిన మొగిలిగిద్ద గ్రామ శివారులోని రంగనాథస్వామి దేవాలయం నేడు కళా వైభవం కోల్పోయింది. కాగా, ఈ ఆలయానికి గ్రామ శివారులో 160 ఎకరాల భూములున్నాయి. అందులో 50 ఎకరాల భూమి ట్రస్టీగా ఉన్న పూజారులకు ఉన్నట్లు సమాచారం. మిగతా 110 ఎకరాల భూములు ఉన్నాయి.

వివాదంలో రూ. 2.50 కోట్ల భూమి

ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద శివారులో ఉన్న శ్రీ రంగనాథ స్వామి దేవాలయానికి చెందిన 5 ఎకరాల భూమి 40 ఏళ్లుగా అన్యాక్రాంతంలో ఉంది. షాబాద్ మండలం మన్‌మర్రి గ్రామ శివారులో ఉన్న ఈ భూమిని గతంలో ఓ వ్యక్తి రికార్డులు తారుమారు చేసి రైతులకు విక్రయించాడు. గతంలో ఆ విషయం వెలుగు చూడటంతో దేవాదాయ శాఖ అధికారులు కోర్టును ఆశ్రయించారు. దేవాదాయ శాఖకు అనుకూలంగా తీర్పు రావడంతో ఆ భూమిలో అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. కానీ రైతులు మళ్లీ కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడంతో మళ్లీ కథ మొదటికి వచ్చింది. అక్కడ ఎకరం విలువ రూ. 50 లక్షలకు పైగానే ఉంటుంది.

మరికొన్ని ఆలయాల భూములు

700 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట భవానీ మాత, ఆంజనేయస్వామి దేవాలయం పేరుతో 16 ఎకరాల భూములు ఉన్నాయి. దేవునిపల్లి గ్రామంలో ఉన్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి 38 ఎకరాల భూములు ఉన్నాయి. వెలిజర్ల గ్రామంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి 40 ఎకరాల భూములు ఉన్నాయి. రాయికల్ గ్రామ శివారులోని తిరుమలనాథస్వామి ఆలయానికి 9 ఎకరాలు, ఎల్లమ్మ ఆలయానికి 4.07 ఎకరాల భూములు ఉన్నాయి. కేశంపేట మండలం కాకునూరు శ్రీ మహాలింగేశ్వరస్వామి దేవాలయానికి 45 ఎకరాలు, పోమాలపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి 8 ఎకరాలు, వేముల్‌నర్వ వేణుగోపాలస్వామి ఆలయం పేరుతో 22 ఎకరాలు, నిర్దవెల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి 20ఎకరాలు, వేంకటేశ్వరస్వామి ఆలయానికి 5 ఎకరాలు, నందిగామ మండలం చేగూరు సీతారామచంద్రస్వామి ఆలయానికి 40 ఎకరాలు, దేవుని మామిడిపల్లి సీతారామచంద్రస్వామి ఆలయానికి 38 ఎకరాల భూములు ఉన్నాయి. కొత్తూరు మండలం పెంజర్ల అనంత స్వామి ఆలయానికి 15 ఎకరాలు, కొందుర్గు మండలం చెర్కుపల్లిలోని వేంకటేశ్వర ఆలయానికి 74 ఎకరాల భూములు ఉన్నాయి. ఎంకిర్యాల వేంకటేశ్వర స్వామి ఆలయానికి 23 ఎకరాల భూములు ఉన్నాయి. షాబాద్ మండలం సీతారాపూర్ గ్రామంలో వెలసిన సీతారామచంద్ర స్వామి దేవాలయానికి ఫరూఖ్‌నగర్ మండలం రంగంపల్లి గ్రామ శివారులో 142 ఎకరాల భూములు ఉన్నాయి. అయితే, సదరు భూములు చాలా వరకు ఆక్రమణలో ఉన్నాయని ఆరోపణలు ఉన్నాయి. అంతేగాకుండా ఆ భూముల్లో కొందరు యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు.

అలంకార ప్రాయంగా కమిటీలు

ఆలయాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన కమిటీలు రాజకీయాలతో ముడిపడి ఉండటం వల్ల అవి నామమాత్రంగా మిగిలిపోతున్నాయి. భూములకు కౌలు ధరలు నిర్ణయిస్తున్న కమిటీలు భూములను అంతగా పట్టించుకోవడం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ఆలయ భూములు సమగ్ర సర్వే చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఒకచోట 5 ఎకరాల భూమి అన్యాక్రాంతమైతే కోర్టును ఆశ్రయించాం. కోర్టు తీర్పు రాగానే సదరు భూమిని స్వాధీనం చేసుకుంటాం.

- శివకుమార్, ఈవో

క్రైం కార్నర్

టిప్పర్ ఢీకొని యువకుడి దుర్మరణం



కృష్ణ (చిత్రం)

కొత్తూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని యువకుడు దుర్మరణం చెందాడు. ఇటీవల డిగ్రీ పూర్తి చేసుకున్న ఓ యువకుడు ఓ పరిశ్రమలో ఉద్యోగం సంపాదించుకొన్నాడు. విధులకు వెళ్లేందుకు స్కూటీని కూడా కొనుగోలు చేశాడు. రెండు నిమిషాలైతే ఇంటికి చేరుకునే లోపే ఓ టిప్పర్ మృత్యువు రూపంలో వెంటాడింది. అతడి మృతితో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ వద్ద చేగూర్ రోడ్డుపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తుర్పటి కృష్ణ(21) అనే యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కృష్ణ ఇటీవల డిగ్రీ పూర్తి చేసి పెంజర్ల గ్రామ శివారులోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. విధులకు వెళ్లి వచ్చేందుకు కొత్త స్కూటీ కొనుగోలు చేశాడు. నంబర్‌ప్లేట్ కోసం కొత్తూర్‌కు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన టిప్పర్ డ్రైవర్ స్కూటీని ఢీకొట్టడంతో కృష్ణ పైనుంచి దూసుకెళ్లింది. దాంతో అతడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొన్ని మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రావిరాల చెరువుకట్టపై మొక్కలు నాటిన కమిషనర్ వాణి తదితరులు

'వంద రోజుల ప్రణాళిక'లో ప్రజలందరూ భాగస్వాములవ్వాలి

- తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి

మహేశ్వరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): వంద రోజుల ప్రణాళికలో ప్రజలందరూ భాగస్వాములు కావడంతో పాటు పరిసరాల పరిశుభ్రత, పచ్చదనంపై కూడా దృష్టి సారించాలని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి అన్నారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా 59వ రోజు గురువారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో తడి, పొడి చెత్త, సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సులతో పాటు రావిరాల చెరువుకట్టపై వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు ప్రతీరోజు తడి, పొడిచెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. చెత్తాచెదారాన్ని రోడ్లపై వేస్తే జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈ యాదయ్య, సౌమిక్‌కుమార్, గుణాకర్, స్ఫూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్ధులగుట్ట ఆలయం వద్ద అన్యమతస్థులకు దుకాణాలు కేటాయించొద్దు



వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ, భజరంగదళ్ సభ్యులు

శంషాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శ్రీ వెండి కొండ సిద్ధేశ్వరస్వామి(సిద్దులగుట్ట) ఆలయం బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా అన్యమతస్థులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇవ్వొద్దని కోరుతూ విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సభ్యులు గురువారం ఆలయ ఈవో రామశర్మతో పాటు ట్రస్టీ చైర్మన్ మాడపతి నరేందర్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ప్రతీయేటా సిద్ధేశ్వరస్వామి ఆలయం వద్ద జాతర, బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. అన్యమతస్థులు దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారని, కొందరు ఉత్సవాల్లో వెకిలి చేష్టలకు పాల్పడుతునేవారని వివరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్యమతస్థులకు దుకాణాలు ఏర్పాటు చేయకునేందుకు అవకాశం ఇవ్వద్దని కోరారు. మెతకవైఖరి అవలంబిస్తే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు హరికుమార్‌గౌడ్, నర్సింహ, భజరంగ్‌దళ్ సభ్యులు జీవన్‌కుమార్, జైదివాకర్‌లు తదితరులున్నారు.

స్నేహితుడికి ఆర్థిక చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

శంషాబాద్ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మంచాన పడ్డ స్నేహితుడికి స్నేహితులు తలాకొంత పోగుచేసి రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. నర్కూడ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 1999-2000 బ్యాచ్ విద్యార్థులు ఇటీవల ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఆ సమయంలో ఎస్సెస్సీ క్లాస్‌మేట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఎవరికి ఇబ్బంది వచ్చినా ఆదుకోవాలని నిశ్చయించుకున్నారు. ఈమేరకు నర్కూడకు చెందిన పురిమామిడి శ్రీనివాస్ పక్షవాతానికి గురైన విషయం తెలుసుకున్న క్లాస్‌మేట్స్ రూ.50 వేల నగదు బాధితుడి కుటుంబానికి బుధవారం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, కార్యదర్శి మహేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సిద్దులు, కమ్రొద్దీన్, వెంకటేష్, సంజీవ, రవి, కుమార్‌గౌడ్, రాజు, పాండుచారి, రవికాంత్‌రెడ్డి, నర్సింహ తదితరులు ఉన్నారు.

మీనాక్షీ నటరాజన్‌కు ఘనస్వాగతం

- చిలుకూరు ఆలయంలో ప్రత్యేక పూజలు
- స్వాగతం పలికిన యాదయ్య, నాయకులు



మొయినాబాద్ రూరల్ : మీనాక్షీ నటరాజన్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే యాదయ్య



చేవెళ్ల : మీనాక్షీ నాటరాజన్‌కు భారీ గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

చేవెళ్ల/మొయినాబాద్ రూరల్/మహేశ్వరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనహిత పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గ కేంద్రానికి వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డిలకు గురువారం చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రాల్లో చేవెళ్ల కాలె యాదయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని షాబాద్ చౌరస్తాలో మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ, వైఎస్సార్, అంబేద్కర్‌ల విగ్రహాలకు మీనాక్షీ నటరాజన్ పూలమాల వేసి నివాళులర్పించారు. భీంభరత్ ఆధ్వర్యంలో చేవెళ్లలో క్రేన్ సాయంతో ఏర్పాటు చేసిన భారీ గజమాలతో మీనాక్షీ నటరాజన్‌కు స్వాగతం పలికారు. జోరు వర్షంలోనూ డీజే, డప్పుల దరువులు, టపాసుల శబ్దాలతో చేవెళ్ల పట్టణ కేంద్రం మార్మోగింది. కాగా, కొద్దిదూరం పాదయాత్రగా వెళ్లిన అనంతరం వారంతా ప్రచార రథంపై ఎక్కి నాయకులకు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ఈ సందర్భంగా జై కాంగ్రెస్, జైజై కాంగ్రెస్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం వికారాబాద్ జిల్లా పరిగికి తరలివెళ్లారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నక్క బుచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఆగిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వినోద్, భార్గవ్‌రామ్, రవి, శ్రీనివాస్, చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చేవెళ్లలో సీఐలు భూపాల్‌శ్రీధర్, వెంకటేశంల ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాగా, అంతకుముందు మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్, మంత్రి శ్రీధర్‌బాబులకు మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలో ఎమ్మెల్యే యాదయ్య ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు చిలుకూరు బాలాజీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అంబేడ్క ర్, బాబూ జగ్జీవన్‌రాంలతో పాటు రాజీవ్ గాంధీ విగ్రహాల కు పూలమాలలువేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాల య సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, షాబాద్ దర్శన్, బైకని కుమార్‌యాదవ్, అశోక్‌యాదవ్ నాయకులున్నారు. కాగా, పరిగికి మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. కృష్ణానాయక్, మురళీధర్‌రెడ్డి, పాండునాయక్, లాజర్, సమత తదితరులున్నారు.

చేవెళ్లలో బయటపడ్డ గ్రూపులు

చేవెళ్ల కాంగ్రెస్ పార్టీలో రెండు గ్రూప్‌లు విభేదాలు మరోమారు బయటపడ్డాయి. ఎమ్మెల్యే కాలె యాదయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్‌ల గ్రూపు రాజకీయాలు బహిర్గతమయ్యాయి. ఎమ్మెల్యే తన వర్గ నాయకులతో కలిసి మొయినాబాద్ మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో మీనాక్షీ నటరాజన్‌కు స్వాగతం పలికారు. భీంభరత్ తన అనుచర వర్గ నాయకులతో కలిసి చేవెళ్ల పట్టణ కేంద్రంలోని షాబాద్ చౌరస్తాలో స్వాగతం పలికారు. కాగా, ప్రజాప్రతినిధులు, నాయకులు కొందరు ఎమ్మెల్యేతో ఉండగా.. మరి కొందరు భీంభరత్‌తో చేవెళ్లలోనే ఉండిపోయారు. రెండు గ్రూపుల నుంచీ స్వాగతం పలికేందుకు రావాలని ఫోన్లు రావడంతో నాయకులు ఎటువైపు వెళ్లాలో అర్థంకాక తలలు పట్టుకున్నారు. అయితే, కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం చేవెళ్ల కాంగ్రెస్‌లో రెండు గ్రూపులు ఉన్నాయని గ్రహించినట్లు పలువురు చర్చించుకున్నారు.



నియామక పత్రం అందిస్తున్న శ్రీధర్‌రెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

షాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ, లింగారెడ్డిగూడలో బూత్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామం నుంచి బీజేపీ అభ్యర్థి పోటీచేసి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బీఆర్‌ఎస్ పతనం అంచున ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో చాలా వ్యతిరేకత ఉందని, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి ఎన్నికల్లో విజయం సాధించాలన్నారు. మండల కార్యదర్శి మమత సురేష్‌గౌడ్, గ్రామ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మల్లేష్, వెంకటేష్, యాదయ్య, నాయకులు శేఖర్, శ్రీనివాస్, శ్రీశైలం, సాయిరాంగౌడ్, మహేష్, లింగం, శ్రీకాంత్, శశికుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌ను కలిసిన గోలి శ్రీనివాస్‌రెడ్డి



సీఎస్ రామకృష్ణారావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న గోలి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును గురువారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో కమిషన్ సభ్యులతో రామకృష్ణారావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తెలంగాణ ఫుడ్ కమిషన్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను సీఎస్‌కు వివరించినట్లు ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సీఎస్‌ను కలిసిన వారిలో కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, జ్యోతి, గోవర్దన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రోడ్డు వెడల్పు పేరుతో వ్యవసాయ భూములు ధ్వంసం



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మంచాల, జూలై 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు వెడల్పు పేరుతో ప్రైవేటు వ్యక్తులు తమ వ్యవసాయ భూములు ధ్వంసం చేస్తున్నారని తహసీల్దార్ ప్రసాద్‌రావుకు మంచాల గ్రామానికి చెందిన రైతులు గురువారం ఫిర్యాదు చేశారు. బాధిత రైతులు మాట్లాడుతూ మంచాల రెవెన్యూ పరిధి సర్వేనెంబర్లు 688, 724, 704,702, 57లలో వ్యవసాయ భూములు కలిగి ఉన్నామని చెప్పారు. కొన్నిరోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా ప్రైవేటు వ్యక్తులు 40 ఫీట్ల వెడల్పుతో తమ వ్యవసాయ పొలాలను యంత్రాలతో ధ్వంసం చేస్తూ రోడ్డు వేస్తున్నారని అన్నారు. దీంతో కొద్దిపాటి భూములు కలిగి ఉన్న చిన్న, సన్నకారు రైతులమైన తాము తీవ్రంగా నష్టపోతున్నామని చెప్పారు. తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుని తమ భూములను పరిరక్షించాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జంబుల అమరేందర్‌రెడ్డి, సావిత్రమ్మ, లలిత, సుష్మారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కె.యాదగిరి, కె.నర్సింహ తదితరులున్నారు.

జీవాలకు టీకాలు వేయించాలి

- కేశంపేట పశువైద్యాధికారి నివేదిత

కేశంపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): మూగజీవాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు గాను ముందస్తుగా టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి నివేదిత రైతులకు సూచించారు. పోమాల్‌పల్లిలో గురువారం జీవాలకు 251 గొర్రెలకు టీకాలు వేశారు. మూతివాపు సోకిన జీవాల్లో నోటిలోపల పుండ్లు, నాలుక నీలిరంగులోకి మారడం జరుగుతుందన్నారు.

బీజేపీ మండల శాఖ విస్తరణ

ఇబ్రహీంపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఇబ్రహీంపట్నం మండల శాఖను విస్తరించినట్లు పార్టీ మండలాధ్యక్షుడు గోదల శేఖర్‌రెడ్డి తెలిపారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులుగా కంబాలపల్లి శ్రీనివాస్‌రెడ్డి, గుండ్ల బాలశివుడు, ఉపాధ్యక్షులుగా పల్లపు రమేష్, కర్రె బాల్‌రాజ్, కాయల భరత్‌రెడ్డి, మారమోని శ్రీనివాస్, కార్యదర్శులుగా దండె లలిత, కొట్టంల మహేందర్, గోదల రవీందర్ రెడ్డి, కాయల సంతోష్, కోశాధికారిగా ముదిగొండ రాజులను నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం వారికి నియామకపత్రాలు అందజేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలుచుకునేందుకు కృషి చేయాలని మండల బాధ్యులకు ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి సలహా చేశారు.



నియామక పత్రాలు అందుకున్న నాయకులు

పొంచి ఉన్న ప్రమాదం

తెగిన విద్యుత్ వైరు



కేశంపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్వాలలో స్ట్రీట్‌లైన్ విద్యుత్ తీగ తెగిపడి ప్రమాద భరితంగా మారింది. గ్రామస్తుల సౌకర్యార్థం అల్వాల చౌరస్తా నుంచి గ్రామానికి వెళ్లే మార్గంలో స్ట్రీట్ లైన్ ఏర్పాటు చేశారు. ఇటీవల విద్యుత్ వైరు తెగిపడినా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరికైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. రైతులు పొలాలకు వెళ్లే క్రమంలో వైరుకు తగిలితే ఎలా అని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'కాంగ్రెస్ పాలనలో లంబాడీలకు గుర్తింపు లేదు'

ఆమనగల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో లంబాడీలకు తగిన గుర్తింపు లేదని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్ అన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీలకు స్థానం కల్పించలేదని ఆరోపించారు. లంబాడి విద్యార్థి సంఘాలు గాంధీభవన్ ముట్టడి పిలుపు నేపథ్యంలో గురువారం దశరథ్‌నాయక్‌ను ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్ తరలించారు. గిరిజనులకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని దశరథ్ నాయక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పక తప్పదన్నారు. అరెస్టయినవారిలో హరిచంద్‌నాయక్, పాండునాయక్, సేవ్యనాయక్, కిషన్ నాయక్, మోతీలాల్ నాయక్, చందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆమనగల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ చంద్రాయన్‌పల్లి తండాకు చెందిన జటావత్ కళ్యాణ్‌నాయక్ అనారోగ్యంతో మృతిచెందాడు. గురువారం మృత దేహాన్ని బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు, పత్యానాయక్ సేవా ఫౌండేషన్ చైర్మన్ నేనావత్ పత్యానాయక్ సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. గణేశ్, హేమ్లు, కుమార్, తదితరులున్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డిపల్లికి చెందిన దుడ్డు జంగమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. మృతదేహానికి ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ కేశవులు నివాళులర్పించారు. ఖాదర్‌ఖాద్రీ, కృష్ణ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఆమనగల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందుతుందని మాజీ సర్పంచ్ మాడ్గుల పెంటమ్మ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తుందని తెలిపారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పెంటమ్మ టై, బెల్టులు సమకూర్చి గురువారం అందజేశారు. హెచ్‌ఎం మహేందర్‌రెడ్డి, టీచర్లు, మాజీ ఉపసర్పంచ్ యాదయ్య, నాయకులున్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి



ఆమనగల్లు : టై, బెల్టులు అందజేసిన పెంటమ్మ

శంకర్‌పల్లి : విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని శ్రీరేసు సత్తిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(మహారాజ్‌పేట్) ప్రధానోపాధ్యాయులు అంజయ్య తెలిపారు. శ్రీరేసు సత్తిరెడ్డి ట్రస్టు చైర్మన్ రేసు రాజేందర్‌రెడ్డి, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ మహేందర్‌రెడ్డిలు విద్యార్థులకు నోట్‌బుక్‌లు సమకూర్చగా గురువారం ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అందజేశారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్వేత, టీచర్లు ఉన్నారు.

పాఠశాలకు గ్రీన్‌బోర్డులు వితరణ

ఇబ్రహీంపట్నం : బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, ఉప్పరిగూడ మాజీ సర్పంచ్ బూడిద రాంరెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు రూ.4లక్షల విలువచేసే గ్రీన్ బోర్డులను అందజేశారు. ఉప్పరిగూడ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక వసతులతోపాటు బోధనా సామగ్రి అవసరమనే ఉద్దేశంతో తన వంతుగా బోర్డులను అందజేసినట్లు వివరించారు. ఇప్పటికే ఉప్పరిగూడ పాఠశాల అభివృద్ధికి చేయూతనందించానన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : రాంరెడ్డిని సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు



శంకర్‌పల్లి : నోట్‌బుక్‌లతో విద్యార్థులు